క్లుప్తంగా

స్టాపర్ల ఏర్పాటు



జొన్నాడ వద్ద టైర్లు ఏర్పాటును పరిశీలిస్తున్న ఎస్‌ఐ సన్యాసినాయుడు

డెంకాడ: మండలంలోని విజయనగరం–విశాఖ జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపడుతున్నారు. ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు రహదారిలోని బ్లాక్‌స్పాట్‌ల వద్ద స్టాపర్లుగా రేడియం స్టిక్కర్లు అతికించిన 50 టైర్లను ఉంచారు. ఐదో ఏపీ ఎస్పీ బెటాలియన్ మెయిన్ గేట్ ప్రాంతం, ఐనాడ జంక్షన్, జొన్నాడ పైడితల్లి అమ్మవారి ఆలయానికి ఎదురుగా ఉన్న రోడ్డు, మోదవలస వద్ద ఈ టైర్లను ఏర్పాటు చేసినట్లు భోగాపురం సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ ఎ.సన్యాసినాయుడు తెలిపారు.

గుట్టలుగుట్టలుగా పరిశ్రమల వ్యర్థాలు



కుప్పలుగా పోసిన పరిశ్రమల వ్యర్థాలు

పూసపాటిరేగ: మండలంలోని గైతులచోడవరం గ్రామ సమీపంలో గుట్టలుగుట్టలుగా పరిశ్రమల వ్యర్థాలు నిల్వ చేయడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. నిబంధనలు అతిక్రమిస్తూ జనావాసాలకు దగ్గరలో ఇలా వ్యర్థాలు పడేయడమేంటని ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఇప్పటికే పలువురు రైతులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ఇప్పటికైనా వ్యర్థాలు తొలగించే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి



దరఖాస్తు ఫారాలు ఆవిష్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

విజయనగరం టౌన్: పట్టణ ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇచ్చే ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెత్సా సత్యనారాయణమూర్తి కోరారు. ఇదే విషయమై ఆయన నగరంలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. 2024–25 విద్యాసంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షల్లో 85 శాతానికి పైగా మార్కులు వచ్చిన ఆర్యవైశ్య విద్యార్థులు ఈ పురస్కారాలకు అర్హులన్నారు. ఆగస్టు 15వ తేదీన ఇచ్చే ఈ అవార్డులకు దరఖాస్తు ఫారంతో పాటు మార్కుల జాబితా తెలిపే జిరాక్సులను కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. అనంతరం దరఖాస్తు ఫారాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బొడ్డు కృష్ణారావు, ఏడు కొండలు, చంద్రశేఖర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

విజయనగరం క్రైమ్: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కామాక్షినగర్, ఉడా కాలనీ శివారుల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడిన ఆరుగురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం డ్రోన్ సాయంతో తనిఖీలు చేయగా కలెక్టరేట్‌కు దగ్గరలో గంట్యాడ వెళ్లే దారిలో రెండు చోట్ల మందు తాగుతుండగా పట్టుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. నేర నియంత్రణలో భాగంగా డ్రోన్‌ల సాయంతో నిఘా పెట్టామని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు సాగాలి

లక్కవరపుకోట: వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం అవలంబిస్తూ రైతులు ముందుకు సాగాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సూచించారు. మండలంలోని రంగరాయపురంలో అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ ద్వారా మంజూరైన డ్రోన్‌ను ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రోన్ పనితీరును ఎ.డి భానులత, కో ఆర్డినేటర్ బి. భారతి వివరించారు. కార్యక్రమంలో కరెడ్ల ఈశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, ఏఓ హరికృష్ణ, ఏఈఓ ఆర్.ముత్యాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

జామి: మండలంలోని విజినిగిరి గ్రామానికి చెందిన ఆరిపాక పార్వతమ్మ శుక్రవారం మృతి చెందడంతో అంత్యక్రియల కోసం ఆమె కుటుంబ సభ్యులకు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు రూ. 21 వేలు అందించారు. పార్వతమ్మ కుటుంబ సభ్యులు నిరుపేదలు కావడంతో అంత్యక్రియల కోసం ఇబ్బంది పడుతున్న తరుణంలో యువత ముందుకొచ్చి ఆమె భర్తకు నగదు అందజేశారు. కార్యక్రమంలో ఇజ్జాడ సత్యనారాయణ, చిన సత్యనారాయణ, కె.శ్రీను, కిలారి కిరణ్, బి.హరినాయుడు, విజినిగిరి రవి, పి.త్రినాథ్, బి.నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్‌లను నమ్మి..

ప్రజలు మోసపోయారు..

- మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: ఎన్నికలకు ముందు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు చెప్పిన మాయమాటలను నమ్మి ప్రజలు మోసపోయారని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నెల్లిమర్ల నియోజకవర్గం ఇన్‌చార్జ్ బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని సవరవల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం జరగ్గా, ఆ తర్వాత రావాడ, తూడెం, కవులవాడ, పోలిపల్లి, లింగాలవలస గ్రామాల్లో జరిగిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ సమావేశాల్లో వారు పాల్గొని, కూటమి పాలనకు వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న తేడాను వివరించారు. గతంలో వైఎస్సార్ సీపీ పాలనలో ఇంటింటా సంక్షేమ వెలుగులు కనిపించేవని, సంక్షేమ పథకాలతో పేద ప్రజల ఆర్థిక స్థితిగతులు మార్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగనన్న పాలన కొనసాగిందని, అప్పుడున్న పరిస్థితి ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదన్నారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు అమలు సాధ్యం కాని హామీలిచ్చారన్నారు. ఏ ఒక్క పథకం పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. అయినా ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు కొత్తేమీ కాదని ఎద్దేవాచేశారు.

ఒక ప్రాంతం అభివృద్ధికేనా పట్టంగట్టింది?

రాష్ట్రమంతటినీ అభివృద్ధి చేస్తానని చెప్పి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి అభివృద్ధి అంటూ కేవలం ఆ ప్రాంత ప్రగతికే చంద్రబాబు పరిమితమయ్యారని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ధ్వజమెత్తారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖను పరిపాలన రాజధానిగా ప్రకటిస్తే దానిపై కూడా విష ప్రచారం చేసి లబ్ధి పొందారని దుయ్యబట్టారు. విశాఖకు పరిపాలన రాజధాని ఖ్యాతి లభిస్తే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెంది ఉండేదని ఆ అవకాశాన్ని కోల్పోయామన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అన్ని అడ్డంకులు తొలగించి జగనన్న చేతుల మీదుగా పనులకు శంకుస్థాపన చేశామని, తమ హయాంలోనే దాదాపు పనులన్నీ పూర్తయ్యాయని గుర్తు చేశారు.



సవరవల్లిలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ బెల్లాన, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ తదితరులు

కేసులకు భయపడం..

వంద రోజుల్లో వంద కంపెనీలు పెట్టి వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పిన స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమాధవి.. 400 రోజులైనా ఆ ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. ఎన్ని కంపెనీలు తెచ్చారో..ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారో యువతకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గాన్ని తనతో పాటు పాత తరం నాయకులు కూడా పరిపాలించారని ఎప్పుడూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే నడుచుకున్నామన్నారు. కేసుల పేరిట కొత్త రాజకీయాలకు తెర తీస్తే ఇక్కడ బయపడేవారు ఎవరు లేరని హెచ్చరించారు. ప్రజలు కూడా వాస్తవాలు తెలుసుకున్నారని రాబోయే రోజుల్లో గుణపాఠం తప్పదన్నారు. కూటమి మెడలు వంచి మరీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే బాధ్యత తమదని భరోసానిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, రాష్ట్ర హౌసింగ్ బోర్డు మాజీ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి సుందర హరీష్, వైస్ ఎంపీపీలు దంతులూరి రావాడ బాబు, పచ్చిపాల గురునాథరావు, సర్పంచ్‌లు ఉప్పాడ విజయభాస్కరరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పట్నాన తాతయ్యలు, నాయకులు బైరెడ్డి ప్రభాకరరెడ్డి, అప్పలనారాయణ, శ్రీనివాసరాజు, సుబ్బారెడ్డి, రేగాన శ్రీను, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ, మాజీ ఎంపీ బెల్లాన

స్టార్టప్ ఆవిష్కరణలకు ప్రోత్సాహం

డెంకాడ: స్టార్టప్ ఆవిష్కరణలకు మంచి ప్రోత్సాహం ఉందని హైదరాబాద్ ఏఐసీటీఈ సౌత్ సెంట్రల్ రీజనల్ మేనేజర్ డాక్టర్ భీమా లింగేశ్వరరెడ్డి తెలిపారు. మండలంలోని జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెల్ ఆధర్యంలో ఏఐసీటీఈ ఇన్నోవేషన్ సెంటర్ రీజనల్ మీట్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఏఐసీటీఈ ఇన్నోవేషన్ సెంటర్ ప్రాముఖ్యతను వివరించారు. ఐపీ, టెక్నాలజీ బదిలీల పట్ల తీసుకోవాల్సిన చొరవపై అధ్యాపకులకు, ఔత్సాహిక విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏఐటీసీఈ పలు ప్రోత్సాహక కార్యక్రమాలైన కపిలి–పేటెంట్ ఫైలింగ్, యుక్తి–విద్యార్థుల ఇన్నోవేషన్, వ్యవసాయ, ఆర్గానిక్ ఆవిష్కరణలు నిర్వహిస్తోందన్నారు. అనంతరం ఆయనను కళాశాల సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ తమ్మినేని హరిబాబు, ఐఐసీ విభాగం డీన్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



లింగేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ హరిబాబు, తదితరులు

విద్యుత్ స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించండి



విద్యుత్ స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

విజయనగరం గంటస్తంభం: విద్యుత్ స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని 29వ వార్డులో విద్యుత్ స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా చేపట్టిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం కాలనీలు, అపార్టమెంట్లలో విద్యుత్ స్మార్ట్‌మీటర్లు బిగించేందుకు వస్తున్నారని, ఎవరైనా అలా మీ ఇంటికి వస్తే వద్దని చెప్పాలని తెలిపారు. స్మార్ట్‌మీటర్ల వల్ల నష్టమే తప్ప లాభం లేదన్నారు. ఒకప్పుడు వద్దన్న వారే ఇప్పుడు ఆ స్మార్ట్ మీటర్లను తెస్తుండడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే అయ్యప్పనగర్‌లో సాయి అమృత రెసిడెన్సీలో బిగించేందుకు వచ్చిన సిబ్బందిని స్థానిక అయ్యప్పనగర్ పోరాట కమిటీ సభ్యులు అడ్డుకున్నారని తెలిపారు. నగరంలో సీపీఎం చేసిన సర్వేలో 2024లో రూ.600 కరెంట్ బిల్లు వస్తే అది నేడు రూ.2 వేలకు చేరుకుందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో విద్యుత్ చార్జీలు భరించలేనంతగా ఉన్నాయన్నారు. భవిష్యత్‌లో స్మార్ట్‌మీటర్లు వ్యతిరేకిస్తూ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి యు.ఎస్.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల పేరిట అక్రమంగా ఫీజుల వసూళ్లు

విజయనగరం గంటస్తంభం: జిల్లాలో పలు ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల యాజమాన్యాలు పరీక్షల పేరిట అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి బి.వాసు, కె.అప్పన్నలు కోరారు. ఇదే విషయమై వారు నగరంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రాక్టికల్స్, సీబీటీ పరీక్షలని ఒక్కో విద్యార్థి నుంచి రూ.3 వేల దగ్గర నుంచి రూ.5 వేల వరకు ఫీజులు వసూలు చేయడం జరుగుతోందని, దీంతో పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫీజు చెల్లిస్తేనే పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు సహకరిస్తామని భరోసానిస్తూ ఈ దందా కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. కళాశాలల్లో జరుగుతున్న ఈ ఫీజుల దందాపై సమగ్ర దర్యాప్తు చేయించాలని లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి వి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

జాతి నిర్మాతలు.. ఉపాధ్యాయులు



ఆర్‌జేడీ విజయ్‌భాస్కర్‌తో వేణుగోపాలపురం డైట్ అధ్యాపక బృందం

నెల్లిమర్ల: ఉపాధ్యాయులు జాతి నిర్మాతలని, అంతటి గౌరవప్రదమైన వృత్తి విద్యను అభ్యసిస్తున్న వారు చదువులో రాణించడంతో పాటు సత్ప్రవర్తన కూడా కలిగి ఉండాలని విద్యాశాఖ ఆర్‌జేడీ టి.విజయ్‌భాస్కర్ సూచించారు. స్థానిక పట్టణ పరిధిలోని వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్ కళాశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. అనంతరం కొత్తగా ఉపాధ్యాయ విద్యనభ్యసిస్తున్న(ఛాత్రోపాధ్యాయులు) వారిని ఉద్దేశించి మాట్లాడారు. విద్యాభ్యాసం అంటే కేవలం మార్కులు, ర్యాంకులు మాత్రమే కాదని, సత్ప్రవర్తన, నైతిక విలువలు కూడా కలిగి ఉండడమన్నారు. చదువు చెప్పడంతో పాటు మంచి వ్యక్తిత్వం కలిగిన వ్యక్తులుగా విద్యార్థులను తీర్చిదిద్దాలని అధ్యాపకులకు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

పూసపాటిరేగ: ప్రతిఒక్కరూ ఆరోగ్యవంతమైన సమాజానికి వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని వక్తలు తెలిపారు. మండలంలోని పతివాడ, రెల్లివలస గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ సర్వే బృంద సభ్యులు శుక్రవారం పర్యటించి, ఆయా గ్రామాల్లోని పారిశుధ్య పరిస్థితులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. చెత్తాచెదారాన్ని గ్రీన్‌అంబాసిడర్లకు అందజేసి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి వద్ద గానీ ఇంటి పరిసరాల్లో గానీ అనవసర నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలన్నారు. వారి వెంట ఈవోపీఆర్‌డీ జ్ఞానేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పీడీఎస్ బియ్యం వేలం

విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని పలు మండలాల్లో జరిగిన తనిఖీల్లో పట్టుబడిన పీడీఎస్ బియ్యం శనివారం వేలం వేస్తున్నట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి కె.మధుసూదనరావు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. విజయనగరం, బొబ్బిలి, నెల్లిమర్ల, శృంగవరపుకోట, కొత్తవలస, గజపతినగరం, జామి, వేపాడ మండలాల్లో గతంలో జరిగిన తనిఖీల్లో 131.68 క్వింటాళ్ల బియ్యం లభ్యమైందన్నారు. జిల్లా కేంద్రంలోని ఎం.ఎల్.ఎస్ పాయింట్ వద్ద ఉదయం 10 గంటలకు విజయనగరం తహసీల్దారు ఆధ్వర్యంలో బియ్యాన్ని బహిరంగంగా వేలం వేయనున్నారని ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొని బియ్యం దక్కించుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ త్రినాథరావు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. విద్యుత్ మరమ్మతు పనుల నేపథ్యంలో పినతరిమి, పెదతరిమి, బొప్పడాం, మధుపాడ, బొడ్డపేట, సతివాడ కల్లాలు, వల్లూరు, ఒమ్మి, మల్యాడ, వెంకన్నపాలెం గ్రామాలు సహా నెల్లిమర్ల సబ్‌స్టేషన్ పరిధిలోని మొయిద, నారాయణపట్నం, పూతికపేట, కొండగుంపాం, గరికిపేట, చింతలపేట, పెదమజ్జిపేటలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరెంట్ ఉండదన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

ఫైర్‌స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

పూసపాటిరేగ: మండల పరిధిలోని కోనాడ జంక్షన్ వద్ద ఫైర్‌స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే లోకం నాగమాధవి శుక్రవారం శంకుస్థాపన చేశారు. రూ.2.25 కోట్ల వ్యయంతో ఈ నిర్మాణం చేపట్టనున్నామని, ఫైర్‌స్టేషన్ నిర్మాణం నియోజకవర్గ ప్రజల కళ అని అది ఇప్పుడు నెరవేరుతున్నందుకు సంతోషంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. 30 ఏళ్లుగా మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి ఫైర్‌స్టేషన్ నిర్మాణం మంజూరుకు ప్రయత్నాలు చేశారన్నారు. ఆరు నెలల్లో నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. భోగాపురంలో రిజిష్టర్ కార్యాలయం నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో విశాఖ రీజనల్ ఫైర్ అధికారి డి.నిరంజన్, విజయనగరం జిల్లా ఫైర్ అధికారి బీవీఎస్ రామ్‌ప్రకాష్, ఎంపీడీవో ఎం.రాధిక, నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ దూరం..

ఇదిలా ఉంటే ఈ శంకుస్థాపన కార్యక్రమానికి నియోజకవర్గ టీడీపీ నాయకులు దూరంగా ఉన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కర్రోతు బంగార్రాజు, మండల టీడీపీ అధ్యక్షుడు మహంతి శంకరరావు, టీడీపీ మాజీ జిల్లా అధ్యక్షుడు మహంతి చిన్నంనాయుడు, మాజీ జెడ్పీటీసీ ఆకిరి ప్రసాదరావులకు కార్యక్రమం గూర్చి సమాచారం ఇవ్వలేదనే చర్చ జరుగుతోంది. దీంతో నియోజకవర్గ కూటమిలో చిచ్చు మొదలైందా అనే సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న అసోసియేషన్ ప్రతినిధులు, పెన్షనర్లు

విజయనగరం టౌన్: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక బాలాజీ జంక్షన్ వద్ద ఫోరం ఫర్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీఎస్ఎన్ఎల్, పోస్టల్ రిటైర్డ్ ఉద్యోగులు శుక్రవారం మానవహారం చేపట్టారు.

ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు టీఎస్ ప్రకాశరావు, జిల్లా కార్యదర్శి జి.భాస్కరరావులు మాట్లాడుతూ గత పెన్షనర్లను పదవీ విరమణ సంవత్సరం ప్రకారం విభజించి, వారి చట్టబద్ధమైన పెన్షన్ సవరణ తిరస్కరించాలనే కేంద్ర ప్రభుత్వం ధృవీకరణ నిబంధనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వేలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. తక్షణమే ఎనిమిదో వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలని, సమాన పని, సమాన పింఛన్‌ను పునఃపరిశీలించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కె.నారాయణరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలి

శృంగవరపుకోట: అరుకు ఘాట్ రోడ్డులో విధులు నిర్వహించే ఆర్టీసీ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గేట్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.జి.నాయుడు, కె.కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ నెల 6న గన్నెల జంక్షన్ వద్ద డిపో కండక్టర్, డ్రైవర్లపై సుమారు పది మంది ఒడిశా వాసులు గంజాయి మత్తులో దాడి చేశారన్నారు. వారిపై అరుకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అదే వ్యక్తులు తాజాగా సుంకరమెట్ట కాఫీ తోటల వద్ద, బొర్రా జంక్షన్ వద్ద మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని చెప్పారు. సీసీ పుటేజ్‌లో నిందితులు స్పష్టంగా కనిపిస్తున్నా పోలీసులు చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు ఆత్మగౌరవం కాపాడేలా, రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోకుంటే ఘాట్‌లో విధులు బహిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు ఆర్టీసీ ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు హాజరయ్యారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో చేరండి..

మెరకముడిదాం: ఓపెన్ స్కూల్ ద్వారా టెన్త్, ఇంటర్ కోర్సుల్లో చేరాలని ఎంఈఓలు చంద్రశేఖర్, ధర్మశ్రీను పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఎంఆర్‌సీ భవనంలో మండలానికి చెందిన అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఈ ఓపెన్‌స్కూల్ వాల్‌పోస్టర్లను ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువు మధ్యలో మానేసిన వారికి ఇదొక మంచి అవకాశమన్నారు. 2025 ఆగస్టు 31 నాటికి 14 సంవత్సరాలు నిండి ఉన్న వారు 10వ తరతగతికి.. 10వ తరగతి పూర్తయి 15 సంవత్సరాలు నిండినవారు ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు 94409 82120, 94419 47199 నంబర్లను సంప్రదించాలని కోరారు.

దుకాణాల ముందు వాహనాలు పెడితే చర్యలు

చీపురుపల్లి రూరల్(గరివిడి): ఫేకర్ రోడ్డులో గల షాపుల ముందు వాహనాలను నిలిపితే షాపుల యజమానులపై చర్యలు తప్పవని ఎస్సై బి.లోకేశ్వరరావు అన్నారు. ఈ మేరకు దుకాణదారులకు శుక్రవారం అవగాహన కల్పించారు. షాపుల ముందు వెహికల్స్ నిలిపివేయడం వల్ల ట్రాఫిక్ సమస్య నెలకొంటుందని.. ఈ విషయాన్ని వాహనదారులకు తెలిజేయాలని సూచించారు.

జిందాల్ నిర్వాసితుల వినూత్న నిరసన



చేతుల్లో ఆకులు పట్టుకుని నిరసన తెలియజేస్తున్న జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట: మీ జీవితాలు మార్చేస్తాం.. అంటూ చెప్పి భూములు లాక్కున్న జిందాల్ కంపెనీ ప్రతినిధులు మాకు అన్యాయం చేశారని జిందాల్ నిర్వాసితులు మండిపడ్డారు. బొడ్డవర జంక్షన్‌లో నిర్వాసితులు ఆకులు పట్టుకుని శుక్రవారం వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముప్పై రోజులుగా నిర్వాసిత కుటుంబాలు నిరసన తెలియజేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మీటింగుల్లో నాయకులు, అధికారులు చెప్పే సామాజిక న్యాయం ఇదేనా అని ప్రశ్నించారు. రైతులు, పేదల ఆకలి ఎవ్వరికీ కనబడడం లేదని వాపోయారు. కార్యక్రమంలో ఏపీ రైతుసంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్, తదితరులు పాల్గొన్నారు.